క్లుప్తంగా

ఆర్టీసీలో మర్యాద దినోత్సవం

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉద్యోగులు, ప్రయాణికులతో కలిసి శుక్రవారం మర్యాద దినోత్సవం జరుపుకున్నారు. ప్రయాణికులకు పూలు అందించి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నందుకు కృతజ్ఞతలను తెలిపారు. పలువురు ప్రయాణికులకు ఆర్టీసీ క్యూఆర్ కోడ్ ఉన్న కీ చైన్లను అందజేశారు. దీని ద్వారా ఒక్క క్లిక్‌తో ఆర్టీసీలో పది రకాల ప్రయోజనాలను పొందవచ్చని వివరించారు. పలువురు ఆర్టీసీ సిబ్బందిని సైతం అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, కంట్రోలర్, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ రవిబాబుకు అంబేడ్కర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవిబాబు

పాల్వంచ: డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డు వరించింది. ప్రజాసేవ చేస్తూ పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న వారికి ప్రతీ ఏటా ఇచ్చే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎక్సలెన్సీ అవార్డ్‌ను ఈ నెల 17న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రవిబాబు అందుకున్నారు.

మే డేను జయప్రదం చేయండి

ఇల్లెందు: 139వ మేడే కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందులో ఏర్పాటైన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే స్ఫూర్తితో పని గంటల పెంపునకు వ్యతిరేకంగా, నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దుకై , లివింగ్ వేతనానికి, కనీస పెన్షన్ రూ.9వేలకై పోరాడాలని కోరారు. సమావేశంలో యాకూబ్‌షావలీ, మధుసూదన్, గోపాల్‌రావు, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిత్యావసరాలు వితరణ



సరుకులు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీ పంచాయతీ ఇందిరానగర్ కాలనీలో గీతా ఆశ్రమం దగ్గర నివాసం ఉంటున్న కర్నాటి కృష్ణకుమారి కుటుంబం పూర్తిగా దివ్యాంగ కుటుంబం. పెద్ద దిక్కును కూడా కోల్పోయారు. ఈ క్రమంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లోగాని శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, డాక్టర్ నూరిమెహరున్నిసా, జ్యోతిరాణి, చుంచు ఆంజమ్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ సభ వాయిదా



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇల్లెందు: రేపు ఇల్లెందులో జరగనున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) బహిరంగ సభను వాయిదా వేసినట్లు ఆ సంఘం జాతీయ కోకన్వీనర్ కల్తీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులోని ఇందిరానగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది వర్గీకరణ అంటూ ఆదివాసీ ప్రజలను గందరగోళానికి గురిచేయాలని ఓ సభ నిర్వహించారని, ఈ క్రమంలో ప్రజల్లో అయోమయం ఏర్పడిందన్నారు. దీనిని సరి చేసేందుకు ఈ నెల 25న ఇల్లెందులో అన్ని జనరల్ ఉద్యోగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈసం సుధాకర్, గొగ్గెల రామస్వామి, జార కృష్ణ, రామనర్సయ్య, కృష్ణమూర్తి, కృష్ణ పాల్గొన్నారు.

పని స్థలాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

కొత్తగూడెంటౌన్: పని స్థలాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కొత్తగూడెం ఫైర్ ఆఫీసర్ జి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జి.పుల్లయ్య ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఇండస్ట్రియల్ ఏరియాల్లోని ఫ్యాక్టరీలలో అవగాహన కల్పించారు. ఫ్యాక్టరీల్లో ఎల్లప్పుడూ అగ్నిమాపక నివారణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

చిన్ననీటి వనరులంటే లోకువ

తటాకాలు పంట చేలకు వారధి లాంటివి పంట కాల్వలు. ఇవి బాగుంటేనే సాగునీరు చేలకు చేరి పంటలు సమృద్ధిగా పండుతాయి. ఏటా వర్షాలు భారీగా కురిసిన సందర్భంలో కాల్వలు కొంత ఛిద్రమవుతుంటాయి. వీటికి వేసవిలో మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. కానీ నిధుల కేటాయింపు లేకపోవడంతో ఏడేళ్లుగా పంట కాల్వలు మరమ్మతులకు నోచుకోలేదు. ఈ ఏడాదైనా ప్రభుత్వం నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

- నిధుల లేక కొరవడిన మరమ్మతులు
- అధ్వానంగా పంట కాల్వలు
- చివరి తడిపై ప్రభావం



సుదిమళ్ల పెద్దచెరువు

ఇల్లెందురూరల్: 2014లో రాష్ట్రం ఆవిర్భవించాక కొలువుదీరిన ప్రభుత్వం నీటితీరువాను పూర్తిగా రద్దు చేసింది. ఆ తరువాత మిషన్ కాకతీయ పథకాన్ని అమలులోకి తెచ్చి చిన్ననీటి వనరుల పునరుద్ధరణ పనులు చేపట్టింది. ఈ క్రమంలోనే 2020–21లో ప్రభుత్వం నీటిపారుదల శాఖ పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది. ఫలితంగా మైనర్, మీడియం, మేజర్, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) అన్ని నీటిపారుదల శాఖ గొడుగు కిందకు వచ్చాయి. ఇదిలా ఉండగా మిషన్ కాకతీయ పనులు ప్రారంభం కావడంతో చిన్ననీటి వనరుల మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం లేకుండా పోయింది. కానీ 2018 నుంచి రెండేళ్లపాటు కూడా నిధుల కేటాయింపు జరగలేదు. దీంతో మరమ్మతులు లేక పల్లెల్లోని చెరువులు అధ్వానస్థితికి చేరాయి.

చెదిరిన పంట కాల్వలు...

మండలంలో ఏడు పెద్ద చెరువులు, 102 చిన్న చెరువులు, ఐదు చెక్‌డ్యాంలు మొత్తం 110 నీటి వనరులు పంట చేలకు నీటిని అందిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా చెరువులకు సంబంధించిన పంట కాల్వలు సాగునీటి సరఫరాకు అనుకూలంగా లేవు. చాలా వరకు చెరువులలో తూముల వద్ద షట్టర్లు పూర్తిగా మట్టితో నిండిపోయాయి. పంట కాల్వలకు అడుగడుగునా గండ్లు పడి నీటి సరఫరాకు ఇబ్బందిగా మారాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వర్షాకాలంలో కాల్వలకు గండ్లు పడిన చోట రైతులు తమ సొంత ఖర్చులతో ఇసుక బస్తాలను నెట్టుగా వేసి నీటిసరఫరా జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం మండలంలో ఏ చెరువును చూసినా ఇదే పరిస్థితి. వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలకు పంటకాల్వల దుస్థితి కలవరపాటుకు గురి చేస్తోంది. ఇదిలా ఉండగా చెరువుల అధ్వాన పరిస్థితిని గుర్తించిన ఇరిగేషన్ శాఖ అధికారులు మండలంలోని రాఘబోయినగూడెం, సుదిమళ్ల, చల్లసముద్రం, నాయకులగూడెం చెరువుల అభివృద్ధికి అంచనాలతో ప్రభుత్వానికి నివేదించారు. కానీ ఒక్క చెరువుకు కూడా నిధులు మంజూరు కాకపోవడం విచారకరం.

పదిశాతం నిధుల బదలాయింపేది..?

పల్లెల్లోని చెరువులను సాగునీటి అవసరాలతోపాటు చేపల పెంపకానికి కూడా వినియోగిస్తున్నారు. ఉచిత చేపపిల్లల పంపిణీతో మత్స్యశాఖ అధికారులు చాలా చెరువులకు సొసైటీలను నియమించారు. వారు చెరువులలో చేపలు పట్టుకోవడం ద్వారా ఎంతో కొంత ఆదాయం పొందుతున్నారు. నిబంధనల ప్రకారం మత్స్యశాఖ సొసైటీల నుంచి వచ్చిన ఆదాయంలో పదిశాతం నీటి వినియోగ సొసైటీల ఖాతాల్లో జమచేయాలి. కానీ ప్రస్తుతం సంఘాలు లేకపోవడంతో మత్స్యశాఖ ఆ నిధులను తన వద్దే ఉంచుకుంటోంది. నిధుల బదలాయింపు ఎవరికీ పట్టకపోవడం చిన్ననీటి వనరులకు శాపంగా మారింది.

పంటకాల్వలు బాగు చేయాలి...



ఏటా వర్షాకాలంలో నీటి ప్రవాహ ఉధృతికి పంట కాల్వలు కొంత మేర ఛిద్రమవుతాయి. ఇటువంటి వాటిని ఇరిగేషన్ శాఖ అధికారులు గుర్తించి వేసవిలో బాగు చేయిస్తుంటారు. కానీ ఏడేళ్లుగా చిన్ననీటి వనరుల పంట కాల్వల మరమ్మతులను అధికారులు మరిచారు. దీంతో పంటకాల్వలు నేడు మరీ అధ్వాన స్థితికి చేరుకున్నాయి.

– మూడు మాలు, రైతు, కొమరారం

చివరి తడి అందడం కష్టమే..



నీటి వనరు తక్కువగా ఉండటంతో చల్లసముద్రం పెద్దచెరువు నిండటం అరుదు. చెరువులో ఉన్న నీటిని ఎంత పొదుపుగా వాడుకోవాలన్నా కాల్వలకు పడిన గండ్ల కారణంగా నీటి వృథాను అరికట్టలేకపోతున్నాం. అధిక వర్షాలతో చెరువు అలుగు పోసినా కాల్వలు బాగుచేయకపోతే చివరి తడికి నీరందిండం కష్టమే.

– ధనియాకుల బాబు, రైతు, చల్లసముద్రం

నైనీ.. సింగరేణి చరిత్రలో కీలక ఘట్టం



సీఎండీ బలరామ్‌ను అభినందిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు బ్లాక్ గనిని ప్రారంభించిన సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బీఎంఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాధవనాయక్ మాట్లాడుతూ... ఒడిశాలలో నైనీ బొగ్గు బ్లాక్ గని ప్రారంభం కావటం వల్ల సింగరేణికి రానున్న 34 సంవత్సరాల భవిష్యత్ ఏర్పడనుందని, ఈ గనిలో 340 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ప్రతీ సంవత్సరం 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉందని, ఈ గనిని 2015లో కేటాయించినప్పటికీ గత ఒడిశా ప్రభుత్వం భూమిసేకరణ, పర్యావరణ అనుమతుల్లో అలస్యం చేయడం వల్ల అడ్డంకులు ఎదురయ్యాయన్నారు. ఇబ్బందులను అధిగమించి ప్రారంభం కావడం సింగరేణి చరిత్రలో కీలక ఘట్టమని కొనియాడారు. అదేవిధంగా సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు అందరికీ ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని సీఎండీకి వినతిపత్రం అందజేశారు. జీవీ కృష్ణారెడ్డి, ఊట్ల గణేష్, శ్యామ్‌లాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 – 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని జూలూరుపాడు ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సుజాతనగర్: మంగపేట గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రం నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. మహిళలకు ఇచ్చే మహాలక్ష్మి పథకం రూ.2500, రేషన్‌కార్డుల జారీలో గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో కాత్రాల తిరుపతిరావు, జగన్, కోమరారెడ్డి, భూక్యా హతీరామ్, బోడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మహిళా కళాశాలలో విద్యార్థినులు, మహిళలు, గృహిణిలకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8332048249, 9502883686 నంబరులో సంప్రదించాలని కోరారు.

‘సీతారామ’పై అఖిలపక్షం



మంత్రితో గుమ్మడి నర్సయ్య, తదితరులు

ఇల్లెందు: ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జనసౌధలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. నెల రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సీతారామ ప్రాజెక్ట్ నీటిని ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు తరలించాలని కోరిన విషయాన్ని గుర్తు చేస్తూ అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేయగా.. త్వరలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు గుమ్మడి నర్సయ్య తెలిపారు. ఆయన వెంట గోపగాని నర్సయ్య, బండారు మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

మా నీళ్లు మాకు కావాలి..

మా నీళ్లు మాకు కావాలి.. అంటూ ఈ నెల 25న కొత్తగూడెంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు రేపాకుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీతారామ ప్రాజెక్ట్ నీటిని జిల్లాలోని ప్రజలకు సాగు, తాగు నీటిని అందించిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఎస్‌ఏ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, కృష్ణ,మోహన్‌రావు, వజ్జా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల నుంచి ఖాళీ చేయించొద్దు...

సింగరేణి జేకే –5 ఓసీ నిర్వాసితులను జేకే ఏరియాలోని పాత క్వార్టర్లలో నివాసం ఉంచిన కంపెనీ.. ఇప్పుడు ఎలాంటి ఆశ్రయం కల్పించకుండా ఖాళీ చేయించరాదని సీపీఎం జిల్లా నాయకులు ఆర్.శ్రీనివాస్, ఎస్‌ఏ నబీ, మండల కార్యదరిశ కిరణ్ విన్నవించారు. పునరావాసం ప్యాకేజీ లభించని వారికి జేకేలోని ఖాళీ క్వార్టర్లలో ఉంటున్న వారిని అకస్మాత్తుగా ఖాళీ చేయించటం వల్ల వారు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణపై నిరసనలు



కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు



ఇల్లెందు: నిరసన ర్యాలీలో ముస్లింలు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఇల్లెందులో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం జామా మజీద్‌లో నమాజు తర్వాత పాత బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనలతో ఈ ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు.

టేకులపల్లి: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుని వెంటనే వెనక్కి తీసుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. టేకులపల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సదర్ హనీఫ్, సుభాన్ ఆలీ, అహ్మద్ మౌలానా, హఫీజ్ అబ్దుల్ అజీమ్, మౌలానా, ఖాజా, నయీమ్, రఫీ, హాజీ, ఆరిఫ్, రహమతుల్లా, షకీల్, పాషా, రియాజ్, సిరాజ్, సలీం, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు చట్టం 2025 రాజ్యాంగానికి విరుద్ధమని శుక్రవారం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ముస్లింలు నిరసన తెలిపారు. ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. మరికొందరు పోస్టుకార్డులతో ఉద్యమం చేపట్టారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని, ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రతీ పైసా నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజా సంక్షేమం కోసం వెచ్చిస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీలో రూ.20 లక్షలు, వెంకటేశ్వర కాలనీలో రూ.20 లక్షలు, విద్యానగర్ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను శుక్రవారం కూనంనేని ప్రారంభించారు. మాట్లాడుతూ... ఐటీడీఏ నిధులతో నూతన భవనాల నిర్మాణం చేసినట్లు చెప్పారు. ప్రజలకు నిత్యావసరాలైన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్కే సాబీర్‌పాషా, జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్, తహసీల్దార్లు కేఆర్‌కే ప్రసాద్, కృష్ణ, ఎంపీడీఓలు హంకుబాబు, శుభాషిణి, ఐటీడీఏ అధికారులు శ్రీకాంత్, మధుకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కొత్తగూడెంఅర్బన్/పాల్వంచ: పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం వరంలాంటిందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో 46 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు, కొత్తగూడెం క్లబ్‌లో 170 మంది లబ్ధిదారులకు రూ.69.50 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, 86 మందికి రూ.86.86 లక్షల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఎస్కే సాబీర్ పాషా, కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కనగాల అనంతరాములు, నూకల రంగారావు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరండి..



మాట్లాడుతున్న మాజీ మంత్రి వనమా

పాల్వంచ: ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పాత పాల్వంచలోని వనమా ఇంట్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వనమా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజుగౌడ్, కాంపెల్లి కనకేష్, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి, కొత్వాల సత్యనారాయణ, నాయుడు, కనగాల బాలకృష్ణ, మడివి సరస్వతి, దాసరి నాగేశ్వరరావు, ముత్యాల ప్రవీణ్, వీరన్న, రాంబాబు, శంకర్, సమ్మయ్య గౌడ్, మంజుల, దుర్గా ప్రసాద్, కుంపటి శివ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: బీఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బహిరంగ సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున గులాబీ శ్రేణులు కదలాలని, పాతికేళ్ల పండుగకు కదం తొక్కాలని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ అన్నారు. రజతోత్సవ సభకు సన్నాహకంగా శుక్రవారం రామవరంలోని ప్రధాన రహదారి పక్కన స్వయంగా వాల్ రైటింగ్ రాశారు. మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలను గాలికి వదిలి, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందని ఆరోపించారు.

పెన్షన్ ఫండ్ ఏర్పాటు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పెన్షన్ ఫండ్ కోసం ప్రతీ టన్నుకు రూ.20 జమ చేయాలని, అదేవిధంగా కనీస పెన్షన్ రూ.5వేలు చెల్లించాలని బీఎంఎస్ జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. ఈ నెల 17న ఢిల్లీలో జరిగిన సీఎంపీఎఫ్ బోర్డు సమావేశంలో మాట్లాడుతూ... ఎఫ్‌పీ ఎఫ్ 1971 పెన్షన్‌దారులకు ప్రస్తుతం అందుతున్న 1000 కనీస పెన్షన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్) పెట్టుబడుల శాతాన్ని 7 నుంచి 10 శాతానికి పెంచేటప్పుడు తగిన జాగ్రతలు తీసుకోవాలని, సీఎంపీఎఫ్ ప్రధాన కార్యాలయంలో పెట్టుబడులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని సూచించారు. కోలిండియా నిర్ణయం మేరకు ప్రతీ టన్నుపై రూ.20 పెన్షన్ ఫండ్‌లో జమ చేయాలని బోర్డు సభ్యులు సిఫారసు చేయగా.. సీఎండీ బలరామ్ అంగీకరించారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి..



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్: రాజ్యాంగ హక్కులు, అధికారాలు కోల్పోయిన ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల సమస్యను పరిష్కరించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల స్థానిక రాజకీయ రిజర్వేషన్లు, సాగు భూములకు హక్కు పత్రాలు, స్థానిక ఉద్యోగ నియామకాలు లేకుండా అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ నిరుపేదలను (నాన్ ట్రైబ్స్,)గా అభివృద్ధి చెందిన కులాలతో జతకట్టి అభివృద్ధికి దూరం చేశారని పేర్కొన్నారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): మే 7 నుంచి హైదరాబాద్‌లో జరగనున్న అందాల పోటీలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారి వై.జానకి అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన మహిళా, యువజన సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పోటీలకు 120 దేశాల నుంచి మహిళా ప్రతినిధులు పాల్గొంటారని దీనికి ప్రభుత్వం రూ.100 కోట్లు ఖర్చు పెడుతోందని, ఈ పోటీలు నిర్వహించటం అవసరమా అని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులు వారి వ్యాపారాల లాభాపేక్ష కోసం సృష్టిస్తున్న ఈ పోటీలను అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మరోపక్క ప్రేమికుల రోజు జరుపుకుంటున్న అబ్బాయి, అమ్మాయిలకు పెళ్లి చేసే విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్‌లు ఈ అందాల పోటీలలో అర్ధనగ్న ప్రదర్శన చేసే వారి గురించి ఎందుకు నోరుమెదపటం లేదని ప్రశ్నించారు. ఈ పోటీలను వ్యతిరేకిస్తూ ఈనెల 21న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్తి సుభద్ర, జి.మంజుల, ఎస్.లక్ష్మి, కలంకి హరికృష్ణ, వి.మోతీలాల్, బి.శ్యాం, ఎన్.సంజీవ్, కిరణ్‌సాయి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పొరుగు వారిపై ప్రేమ చూపండి..



కొత్తగూడెంటౌన్: సిలువను మోస్తున్న భక్తుడు

క్షమాగుణం... పొరుగువారిపై ప్రేమ.. బాధ్యతగా వ్యవహరించడం.. ఆకలిదప్పికలతో అల్లాడుతున్న మానవాళికి ఏసుక్రీస్తు చూపిన మార్గం నేటికీ స్ఫూర్తినిస్తోందని పాస్టర్లు అన్నారు. ఏసుక్రీస్తు సిలువకు వేయబడిన రోజు శుభ శుక్రవారం సందర్భంగా చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటల అంతరార్థాన్ని తెలుసుకున్నారు. పలువురు సిలువ మోసి భక్తి చాటుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: సిలువ మోస్తున్న ఆర్‌సీఎం చర్చి బ్రదర్ సతీష్



ఇల్లెందురూరల్: మామిడిగూడెం చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



పాల్వంచ: కార్మెల్ గుట్ట వద్ద ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



టేకులపల్లి: సులానగర్‌లో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో సిలువ మార్గం